సాక్షి
మహబూబాబాద్
శుక్రవారం | 31 | జనవరి | 2025



ఫిర్యాదులపై స్పందించాలి

డయల్ 100 ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు వెంటనే స్పందించి ఘటనా స్థలికి చేరుకోవాలని ఆర్గనైజేషన్, హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లాక్రా సూచించారు. - 8లో▸



సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి

సనాతన ధర్మం, సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించాలని త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్‌స్వామి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35.1°/16.9°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



మహబూబాబాద్: ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ చాంబర్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 3 నుంచి 22వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, ఆర్డీఓ కృష్ణవేణి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదార్, డీఎంహెచ్‌ఓ మురళీధర్ పాల్గొన్నారు.

ధైర్యంగా పరీక్షలు రాసేలా అవగాహన కల్పించాలి

- డీఈఓ రవీందర్‌రెడ్డి



మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలను ధైర్యంగా రాసేలా విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల హైస్కూల్‌లో గురువారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు గైడెన్స్, కౌన్సెలింగ్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆత్మస్థైర్యాన్ని నింపాలని, అందుకు అవసరమైన కౌన్సిలింగ్ నిర్వహించాలని, విద్యార్థులు కౌమార దశలో ఎదుర్కొనే సమస్యల గురించి మహిళా ఉపాధ్యాయులు తెలియజేయాలన్నారు. స్కిల్స్ కమ్యూనికేషన్ పెంపొందించాలని, రాష్ట్ర స్థాయిలో జిల్లాను పది ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పిజియాలజిస్ట్ గుడిబోయిన పూర్ణచందర్, ఆర్పీ మహేష్, క్వాలిటీ కోఆర్డినేటర్ ఆజాద్ చంద్రశేఖర్, సైన్స్ అధికారి అప్పారావు, ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు



నెహ్రూసెంటర్: వేసవికాలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు చేపట్టాలని విద్యుత్‌శాఖ నోడల్ అధికారి డి.శ్రీధర్ సూచించారు. విద్యుత్‌శాఖ కార్యాలయంలో గురువారం విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ జె.నరేష్ మాట్లాడుతూ.. జిల్లాలో 349 ఓవర్‌లోడ్ ప్రాంతాలను గుర్తించామని, పనులు చేపట్టేందుకు టెండర్లు పిలుస్తామన్నారు. మరికొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో డీఈ టెక్నికల్ పెద్దిరాజం, డీఈలు విజయ్, మధుసూదన్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రాజ్యలక్ష్మి, ఏడీఈ ప్రశాంత్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంతోపాటు కోమటిపల్లి గ్రామంలో పలు పంటలను హైదరాబాద్ నుంచి వచ్చిన కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ స్కీం డైరెక్టర్ ఆర్.విజయకుమారి, ఫీల్డ్ ఆఫీసర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ స్టాటిస్టిషన్ ఉదయ్‌కుమార్, ఫీల్డ్ సూపర్‌వైజర్ రాంచరణ్ గురువారం పరిశీలించారు. వరితోపాటు పత్తి, పసుపు పంటల సాగుకు అయ్యే ఖర్చులను, కౌలు ధరలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు వారు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత.. మన బాధ్యత

నేటితో ముగియనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

- ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

మహబూబాబాద్ అర్బన్: అజాగ్రత్త, అతివేగం వల్ల ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. గాయాలపాలైన వారు మంచానికే పరిమితమవుతున్నారు. ఇలాంటి ఘటనలు చూస్తున్న యువకులు మాత్రం వాహనాల వేగం తగ్గించడం లేదు. తీరా చూస్తే వారి కుటుంబాలను రోదనలోకి నెట్టేలా చేస్తున్నారు. కాగా రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా జనవరి మాసంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వ హిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు. రోడ్డు రవాణా శాఖ, పోలీసుశాఖ అధికారులు ప్రజలు, ద్విచక్రవాహనదారులు, ఆటో, కారు, లారీ, ఇతర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఈ నెల 31 వరకు..

జిల్లాలో 18 మండలాలు ఉన్నాయి. ప్రతీరోజు ఒక మండల కేంద్రంలోని పలు జంక్షన్లు, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. నేటి(శుక్రవారం)తో ఈ కార్యక్రమం ముగియనుంది. కాగా మైనర్ విద్యార్థులు వాహనాలు నడిపితే చట్టరీత్యా తీసుకునే నేరాలపై వివరిస్తున్నారు. ద్విచక్రవాహనదారులు, ఆటో, కారు, ఇతర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా రవాణాశాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. వీరితో పాటు జిల్లా పోలీసు యంత్రాంగం కూడా భాగస్వామ్యమై ప్రజలకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు, ప్రమాదాలపై అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

నిబంధనలు పాటించాలి



జిల్లాలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు నేటితో ముగుస్తాయి. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కారు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలి. మద్యం తాగి, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దు. ఆటోలు, జీపులు ఇతర వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చు.

\- జైపాల్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి

వాహనాలను జాగ్రత్తగా నడపాలి



గత సంవత్సరం నా కొడుకు ద్విచక్రవాహనం నడుపుతున్న క్రమంలో వెనుకనుంచి కారు ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. నా కొడుకుతో పాటు వాడి ఫ్రెండ్ వారంరోజులు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. వాడి ఫ్రెండ్ మృతిచెందాడు. నా కొడుకు ఒక కాలుకు రెండు రాడ్లు వేశారు. కారు ఓనర్‌పై కేసు పెట్టగా.. కారు ఇన్సూరెన్స్ వస్తుంది అందులో చూసుకోండి అని పరారయ్యాడు. యూత్ పిల్లలు, పెద్దలు అతివేగంగా వాహనాలు నడిపి కుటుంబాలకు శోకం మిగిలించొద్దు. వాహనాలను జాగ్రత్తగా నడిపి ఇంటికి చేరుకోవాలి.

\- చెన్నూరి విజయలక్ష్మి, కాంగ్రెస్ జిల్లా నాయకురాలు

నిబంధనలు ఇవే..

- ఎవరైనా వాహనాలు నడపాలంటే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్,ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ తప్పనిసరి అని జిల్లా రవాణాశాఖ అధికారులు తెలుపుతున్నారు.
- రిజిస్ట్రేషన్ లేకపోతే వాహన చట్టం సెక్షన్ 36, 192 ప్రకారం జరిమానా విధిస్తారు.
- డ్రై వింగ్ లైసెన్స్ లేకపోతే సెక్షన్ 3,4,180, 181 ప్రకారం జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తారు.
- పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోతే సెక్షన్ 190(2) ప్రకారం జరిమానా రూ. 1000 విధిస్తారు.
- ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లేకపోతే సెక్షన్ 196(ఏ) ప్రకారం మూడు నెలలు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తారు.
- మద్యం తాగి వాహనం నడిపితే సెక్షన్ 185 ప్రకారం ఆరు నెలల వరకు జైలు శిక్ష విధిస్తారు.
- ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ నేరంగా పరిగణిస్తారు. మోటార్ వాహన చట్టం ప్రకారం 6 నెలల వరకు జైలు శిక్ష లేదా రూ. 1000 జరిమానా విధిస్తారు.
- పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులకు ఎక్కించుకొని వెళ్తే మోటార్ వెహికిల్ చట్టం ప్రకారం జరిమానా లేదా పర్మిట్‌పై చర్యలు తీసుకుంటారు.
- సీట్ బెల్ట్ ధరించకపోతే సీఎంవీ రూల్ 138(3), సెక్షన్ 177 ప్రకారం జరిమానా రూ.1000 విధిస్తారు.
- సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే రూ. 1000 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ తాత్కాలికంగా నిలిపివేస్తారు.
- హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ.1000 జరిమానా విధిస్తారు.



వాహనదారుడికి పువ్వు ఇచ్చి రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఇలా..

సంవత్సరం	గాయపడినవారు	మృతిచెందినవారు	చిన్న ప్రమాదాలు	మొత్తం ప్రమాదాలు
2022	271	140	279	690
2023	278	130	282	690
2024	286	129	273	688

త్యాగాలను స్మరించుకోవాలి



గాంధీ వర్ధంతి సందర్భంగా మౌనం పాటిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో మహనీయులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి అమరులయ్యారని కొనియాడారు. వారి త్యాగాలను స్మరిస్తూ భావితరాలకు తెలియజేయడం మన బాధ్యత అన్నారు. ఈమేరకు అమరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి పాల్గొన్నారు.



మౌనం పాటిస్తున్న ఎస్పీ, అధికారులు, సిబ్బంది

మహనీయుల ప్రాణత్యాగాలతో స్వాతంత్ర్యం

మహబూబాబాద్ రూరల్: మహనీయుల ప్రాణత్యాగాలతోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ, అధికారులు, సిబ్బంది గురువారం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

అపరిచితుడు సీఎం రేవంత్‌రెడ్డి

- మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత

మహబూబాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అపరిచితుడిలా మాట్లాడుతున్నారని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి 'కాంగ్రెస్ పార్టీ 420 హామీలు.. 420రోజుల మోసపూరిత పాలన' పేరిట వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా కవిత మాట్లాడుతూ.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహించామన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో కూడా రైతులకు రైతుబంధు ఇచ్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనన్నారు. బతుకమ్మ చీరలు ఇవ్వకుండా చేనేత కార్మికులకు ఉపాధి లేకుండా చేశారని, దీంతో వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో 420 బూటకపు హామీలను ఇచ్చి, ఇప్పుడు అమలు చేయడం లేదన్నారు. మార్నేని వెంకన్న, భరత్ కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం వెంకన్న, మురళీధర్‌రెడ్డి, ఫరీద్, రఘు, అశోక్, సలీం ఉన్నారు.



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థినికి అస్వస్థత

కేసముద్రం: ఫుడ్‌పాయిజన్‌తో ఓ విద్యార్థిని అస్వస్థతకు గురైన ఘటన మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రంస్టేషన్‌లోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో హలావత్ సంజన ఆరో తరగతి చదువుతోంది. కాగా హాస్టల్‌లో పెట్టిన జీరారైస్ తింటుండగా పురుగులు కనిపించాయి. అయితే అప్పటికే తినడం పూర్తి చేసిన ఆ విద్యార్థినికి ఈ నెల 28న వాంతులు కాగా.. స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికి తగ్గకపోవడంతో విద్యార్థిని ఆమె తండ్రికి అప్పగించారు. ఈ క్రమంలో సంజనకు వాంతులతోపాటు, విరేచనాలు కావడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో ఆమెను గురువారం మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కాగా తనతోపాటు మరికొందరు విద్యార్థినులు జీరారైస్ తిన్నారని, వారికి కూడా ఫుడ్‌పాయిజన్ అయినట్లు విద్యార్థిని చెప్పింది. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ సుజాతను వివరణ కోరగా.. హాస్టల్‌లో ఎలాంటి ఫుడ్‌పాయిజన్ కాలేదని, సంజన అనే విద్యార్థినికి మాత్రమే వాంతులు కావడంతో ఆమె తండ్రి హాస్టల్ నుంచి తీసుకెళ్లాడని చెప్పారు.



చికిత్స పొందుతున్న విద్యార్థిని సంజన

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు!

మహబూబాబాద్ రూరల్: మానుకోట పట్టణంలోని సిగ్నల్ కాలనీలో సంచలనం సృష్టించిన నాగమణి హత్య కేసులో నిందితులుగా భావిస్తున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.ఈ నెల 16వ తేదీన నాగమణి హత్యకు గురైనట్లు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. పోలీసులు అదే రోజు విచారణ చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నాగమణి హత్య కేసు విచారణలో భాగంగా టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో పలు పోలీసు బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది.

బేగావత్ తండాలో చోరీ

కురవి: మండలంలోని మోద్గులగూడెం గ్రామ శివారు బేగావత్ తండా గ్రామంలో భూక్య వీరన్న -మంగమ్మ ఇంట్లో గురువారం సుమారు రూ.8.50లక్షల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. బేగావత్ తండాకు చెందిన భూక్య వీరన్నకు అదే తండా శివారు సునార్ తండాకు చెందిన కటారియా విజయ్ రూ.8.50లక్షలు ఇచ్చాడు. ఈ క్రమంలో దుండగులు నగదుతో పాటు బంగారం దోచుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీరోలు ఎస్సై నగేష్ సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన సేవలు అందిస్తా..

మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ నిషేధం, పారిశుద్ధ్యంపై దృష్టి

- కుక్కలకు కుటుంబ నియంత్రణ
- అర్హులందరికీ నాలుగు పథకాలు అందేలా చర్యలు
- వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళిక
- మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ టొప్పో



లెనిన్ వత్సల్ టొప్పో

సాక్షి, మహబూబాబాద్: 'జిల్లాలోని మున్సిపాటీల్లో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి, మెరుగైన సేవలు అందించేలా ప్రయత్నిస్తా. ప్రధానంగా ప్లాస్టిక్ నిషేధం, పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పన, పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమాలు వేగవంతం చేస్తా' అని మున్సిపాలిటీల ప్రత్యేక అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. మున్సిపాలిటీల పాలక మండలి పదవీకాలం జనవరి 26వ తేదీతో ముగిసింది. దీంతో మహబూబాబాద్ పట్టణంతోపాటు తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, కొత్తగా ఏర్పడిన కేసముద్రం మున్సిపాలిటీల ప్రత్యేకాధికారిగా నియమితులైన ఆయన గురువారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ప్లాస్టిక్ నిషేధం, పారిశుద్ధ్యంపై దృష్టి

కేన్సర్ వంటి భయానక వ్యాధులకు కారణమైన ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో నిషేధించేందుకు ప్రయత్నిస్తా. మహబూబాబాద్ పట్టణంతోపాటు తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, కేసముద్రం మున్సిపాలిటీల్లో కూడా ప్లాస్టిక్ వాడకం పెరిగింది. దీంతో మురికి కాల్వలు, ఇతర ప్రదేశాల్లో ప్లాస్టిక్ పేరుకుపోయి పారిశుద్ధ్య సమస్య కూడా తలెత్తుతుంది. దీనిని నివారించేందుకు కలెక్టర్ ఆదేశాలతో ఐదు మున్సిపాలిటీల కమిషనర్లతో సమీక్షలు నిర్వహిస్తా. ప్రజల సహకారం ఉంటే ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టడం సాధ్యమేనని భావిస్తున్నా.

కుక్కల బెడదను తగ్గిస్తాం

ఐదు మున్సిపాలిటీల్లో పదివేల మేరకు కుక్కలు ఉన్నట్లు అంచనా. ఈ కుక్కలు పిల్లలు, వృద్ధులు తేడా లేకుండా కరవడం, గాయ పర్చడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. అయితే వీటిని పూర్తిగా నివారించలేము. కాకపోతే జిల్లాలో ఉన్న ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని వినియోగించుకొని కుక్కలకు కుటుంబ నియంత్రణ చేయించి సంతానోత్పత్తిని తగ్గిస్తాం. దీంతో కుక్కల సంఖ్య కూడా తగ్గుతుంది. ఇందు కోసం పశుసంవర్థక శాఖ అధికారులతో చర్చించి ప్రణాళిక తయారు చేస్తాం. ఆ తర్వాత చర్యలు తీసుకుంటాం.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా..

వేసవి వచ్చిందంటే.. అన్ని ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడేది తాగునీటికోసం. ప్రధానంగా మహబూబాబాద్, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ వంటి పట్టణాల్లోని శివారు కాలనీలు, ఎత్తైన ప్రాంతాల్లో తాగునీటి సమస్య వస్తుంది. అయితే ఇటీవల అమృత్ నిధుల ద్వారా చేపట్టిన పనులతో నాలుగు పట్టణాల్లోని తాగునీటి సమస్యను కొంత మేరకు తీర్చే అవకాశం ఉంది. వేసవికి ముందుగానే మున్సిపాలిటీ కమిషనర్లు, వాటర్ సప్లై, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహిస్తాం. త్వరగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తాం.

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరవేసేందుకు వారధిగా పనిచేస్తా. మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరుపై ఇప్పటికే సర్వే నిర్వహించాం. సర్వేలో అర్హులకు అన్యాయం జరిగితే మళ్లీ దరఖాస్తులు తీసుకొని సర్వే చేస్తాం. అయితే అందరికి ఒకే విడతలో పథకాలు అందించలేం. కావునా విడతల వారీగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తా.

ఆహార కల్తీ నివారణ..

పట్టణాల్లోని రెస్టారెంట్లు, హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నాసిరకం నూనెలు, కల్తీ వస్తువులు, కాలం చెల్లిన సరుకులను వినియోగించడం, మాంసం, చేపలు, రొయ్యలు, చికెన్ రోజుల తరబడి నిల్వ ఉంచి వండి పెడుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. కట్టడి చేసేందుకు తనిఖీలు చేపడుతాం. అదేవిధంగా మాంసం, చికెన్, చేపల విక్రయ కేంద్రాలపై కూడా దృష్టి పెట్టి ప్రజారోగ్యానికి హాని కలిగించే అమ్మకాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకుంటాం. నేను తనిఖీలు చేయడమే కాకుండా ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది తరచూ తనిఖీలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

పట్టణ పేదరిక నిర్మూలనకు చర్యలు

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 2,651 స్వయం సహాయక సంఘాల్లో 25,728 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. అయితే వీరిలోని నిరుపేదలు, చేతివృత్తిదారులు, చిరు వ్యాపారులపై ప్రత్యేక దృష్టి పెడతాం. ప్రభుత్వం రుణాలు ఇస్తుంది.. వారు తిరిగి చెల్లిస్తున్నారు.. అనే విషయాలపైనే కాకుండా తీసుకున్న రుణం, ఆర్థిక సహాయాన్ని వారు ఎలా సద్వినియోగం చేసుకున్నారు. వారి కుటుంబాల్లో మార్పు వచ్చిందా.. విద్య, ఆర్థిక పరిపుష్టి, సామాజిక ఎదుగుదలను తెలుసుకొని లోపాలను సరిచేస్తూ.. ఆర్థిక తోడ్పాటు అందించేలా చర్యలు తీసుకుంటాం.

రోడ్డు భద్రతతోనే ప్రమాదాల నివారణ

- జిల్లా రవాణాశాఖ అధికారి జైపాల్‌రెడ్డి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ, డీటీఓ

మహబూబాబాద్ అర్బన్: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా రవాణాశాఖ అధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు గురువారం జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ట్రాఫిక్ నియమాలు తెలుసుకోవాలని, మైనర్లు వాహనాలను నడపవద్దన్నారు. తల్లిదండ్రులతో కార్లలో వెళ్లేటప్పుడు సీట్ బెల్టు ధరించాలని, ద్విచక్రవాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను డీఈఓ రవీందర్‌రెడ్డితో కలిసి జైపాల్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సాయిచరణ్, వెంకట్‌రెడ్డి, ఉద్యోగ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనకు ఐక్యంగా కృషి చేయాలి

- డీఎంహెచ్‌ఓ మురళీధర్

తొర్రూరు: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ మురళీధర్ అన్నారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనకు డీపీఎంఓ వనాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కుష్ఠు వ్యాధి నిర్మూలన కోసం ఆరోగ్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు మీరాజ్, జ్వలిత, మానస, నందన, సిబ్బంది బాలాజీ, మంగమ్మ, సుందరి, కమల, మేరీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

నెహ్రూసెంటర్: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ఫిబ్రవరి 13వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ జి.మురళీధర్ అన్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ ట్రాకింగ్ రెండో బ్యాచ్‌కు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... స్పర్శలేని, మొద్దుబారిన మచ్చలను గుర్తించినట్లయితే వెంటనే స్థానిక పీహెచ్‌సీలో వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్, ట్రెనింగ్ డాక్టర్ సౌజన్య, బిజినెస్ మేనేజర్ ప్రశాంత్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ లవరం, వాల్యా, నరసింహాస్వామి, సబ్ యూనిట్ ఆఫీసర్ ఓబిలిశెట్టి రామకృష్ణ, డీఈఓ ఉమాకర్, అరుణ్, శ్రీనివాస్, ఐలయ్య సిబ్బంది పాల్గొన్నారు.



తొర్రూరు ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ

శిక్షణ శిబిరం పరిశీలన

కురవి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న బాలికల విద్యా శిక్షణ శిబిరాన్ని గురువారం జీసీడీఓ విజయ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన బాలికలకు నాణ్యమైన విద్యనందించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. బాలికలు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు భానుప్రియ, అంజలి, శిరీష, స్వప్న, హెచ్‌ఎం బాబు, హెచ్‌డబ్ల్యూఓ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బాలికలతో మాట్లాడుతున్న జీసీడీఓ విజయ

క్లుప్తంగా

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా వేణు


గొలనకొండ వేణు

నర్సంపేట: ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన గొలనకొండ వేణు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. జనగామ జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.నిరంజన్.. గొలనకొండ వేణును అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ తనను ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరంజన్, రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అభివృద్ధి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటు పడతానని పేర్కొన్నారు.

కాజీపేట మీదుగా కుంభమేళాకు రైళ్లు



కాజీపేట రూరల్ : కుంభమేళా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్ మీదుగా నాలుగు ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు కాజీపేట రైల్వే అధికారులు గురువారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..

ఫిబ్రవరి 18వ తేదీన మౌలాలి-బనారస్ (07087) ఎక్స్‌ప్రెస్ 02.08 గంటలకు, 22వ తేదీన మౌలాలి-అజాంఘర్ (07707) ఎక్స్‌ప్రెస్ 02.08 గంటలకు, 15వ తేదీన మౌలాలి-గయా (07089) ఎక్స్‌ప్రెస్ 19.43 గంటలకు, 18వ తేదీన వికారాబాద్-గయా (07091) ఎక్స్‌ప్రెస్ 19.43 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

టోల్ ఫ్రీ నంబర్‌తో విద్యుత్ సమస్యల పరిష్కారం

- హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ

హన్మకొండ: టోల్ ఫ్రీ నంబర్ 1912తో విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయని టీజీఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. ఈ క్రమంలో టోల్ ఫ్రీ నంబర్‌పై విస్తృత ప్రచారం చేస్తున్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టోల్ ఫ్రీ నంబర్ నిరంతరాయంగా పని చేస్తుందన్నారు. వారానికి 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ నంబర్‌ను వినియోగదారుల ముంగిటికి తీసుకెళ్లేందుకు ప్రతీ విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ముద్రిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో తలెత్తే ఇబ్బందులు, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, లోటట్జేజీ, బ్రేక్ డౌన్స్, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, విద్యుత్ లైన్లు, విద్యుత్ బిల్లుల సమస్యలు, తదితర ఏ సమస్యనైనా టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని వివరించారు. ఫిర్యాదులు పరిష్కారమయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.

చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

- పోక్సో కేసు నమోదు

తరిగొప్పుల: మండల కేంద్రానికి చెందిన చిన్నారిపై ఓ వృద్ధుడు(60) లైంగికదాడికి యత్నించాడు. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారికి వృద్ధుడు చాక్లెట్ ఇస్తానని ఆశచూపి తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నిస్తుండగా చిన్నారి తల్లి గమనించింది. స్థానికుల సాయంతో నిందితుడిని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. ఈ ఘటనపై చిన్నారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సమాచారం.

కేయూ రిజిస్ట్రార్‌గా రాంచంద్రమేనా?

నేటితో ముగియనున్న మల్లారెడ్డి పదవీకాలం

- రిజిస్ట్రార్ పోస్టు కోసం పలువురు ఆసక్తి..
- సీడీసీ డీన్ కోసం, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ పోస్టు కోసం కూడా..
- పాలనపరమైన మార్పులేవీ చేపట్టని ప్రతాప్‌రెడ్డి



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి నియామకమై మూడు నెలలు గడిచాయి. అయినా ఇంకా ఎలాంటి పాలన పరమైన మార్పులు చేయలేకపోతున్నారు. గత వీసీ హయాంలో నియామమైన పలువురు ప్రొఫెసర్లు ఇప్పటికీ అవే పోస్టుల్లో కొనసాగుతున్నారు. అయితే కొందరు ప్రొఫెసర్లు కొన్ని పోస్టులు ఆశిస్తున్నప్పటికీ ఆయా పోస్టుల్లో పాతవారినే కొనసాగిస్తుండడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ప్రొఫెసర్లు ఒక్కొక్కరు రెండు, మూడు, నాలుగు పోస్టుల బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రాంచంద్రమేనా?..

నేటితో ముగియనున్న మల్లారెడ్డి పదవీకాలం

కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి పదవీకాలం నేటి(ఈనెల 31)తో ముగియబోతుంది. ప్రతాప్‌రెడ్డి వీసీగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన నలుగురు ప్రొఫెసర్లు రిజిస్ట్రార్ పోస్టు ఆశిస్తున్నారు. ఇందులో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రస్తుతం ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్, సీడీసీడీన్, విద్యాకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. రాంచంద్రాన్ని రిజిస్ట్రార్‌గా నియమిస్తారని యూనివర్సిటీలో చర్చగా ఉంది. అయితే ఎస్టీ,బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్లు కూడా ఆ పోస్టును ఆశిస్తున్నా రాంచంద్రం వైపే వీసీ మొగ్గుచూపుతున్నట్లు సమాచారం.

> **రిజిస్ట్రార్ పోస్టు కోసం పైరవీలు?**
>
> కేయూ రిజిస్ట్రార్ పోస్టు కోసం ఈసారి పలువురు ప్రొఫెసర్లు పైరవీలు ప్రారంభించారని తెలుస్తోంది. ఒకరైతే ఓయూ మాజీ వీసీ ద్వారా ప్రస్తుత కేయూ వీసీ ప్రతాప్ రెడ్డికి కూడా ఫోన్ చేయించినట్లు పలువురు చెబుతున్నారు. మరో ప్రొఫెసర్ స్థానిక ప్రజాప్రతినిధి ద్వారా, మరి కొందరు వీసీ ప్రతాప్ రెడ్డికి సన్నిహితంగా ఉన్న కాకతీయ యూనివర్సిటీ రిటైర్ ప్రొఫెసర్లతో పైరవీలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రార్‌గా ఎవరిని నియమిస్తారా అనే అంశం కొద్ది రోజుల్లో తేలనుంది.

రిజిస్ట్రార్‌గా రాంచంద్రాన్ని నియమిస్తే నాలుగు పోస్టులు ఖాళీ..

ప్రొఫెసర్ రాంచంద్రాన్ని రిజిస్ట్రార్‌గా నియమిస్తే నాలుగు పరిపాలన పదవులు ఖాళీ అవుతాయి. ఇందులో కీలక రెండు పదవులున్నాయి. సీడీసీ డీన్, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ పదవులు ఉండడంతో రాంచంద్రాన్ని రిజిస్ట్రార్‌గా నియమించిన అనంతరం సీడీసీ డీన్ పోస్టులో తమను నియమించాలని ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్ కోరుతున్నారని సమాచారం. అలాగే, ఈ పోస్టును మరో మహిళా ప్రొఫెసర్ కూడా ఆశిస్తున్నట్లు తెలిసింది. ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ పోస్టును వై. వెంకయ్య, ఈసం నారాయణ ఆశిస్తున్నట్లు సమాచారం.

> **కేయూ ఓఎస్‌డీ పదవి ఆ నలుగురిలో ఒకరికి..**
>
> కేయూలో ఓఎస్‌డీని నియమించుకుని పాలన చేయాల్సిన సంప్రదాయం ఎప్పుడూ లేదు. రాష్ట్రంలో పెద్ద యూనివర్సిటీ ఓయూ పరిపాలన సౌలభ్యం కోసం ఓఎస్‌డీ నియామకం చేసుకుంటున్నారు. అయితే ఉస్మానియా యూనివర్సిటీలో విధులు నిర్వర్తించిన ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి.. కేయూ వీసీగా నియామకమైన తర్వాత ఓఎస్‌డీ నియామకంపై చర్చ జరుగుతుంది. ఓఎస్‌డీ పదవికి ఒక ప్రొఫెసర్‌కు అవకాశం ఇవ్వబోతున్నారు. ప్రధానంగా నలుగురు పేర్లు వినబడుతున్నాయి. ఇందులో ప్రొఫెసర్ మల్లారెడ్డి, ప్రొఫెసర్ వెంకట్రామ్ రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, మామిడాల ఇస్తారి ఉన్నారు. వీరిలో ఎవరో ఒకరిని ఓఎస్‌డీగా త్వరలోనే నియమించబోతున్నారు.

నియామకాలపై జాప్యం..

కేయూలో కొత్త వీసీ నియామకమై మూడు నెలలైనా ఇప్పటి వరకూ కీలక పరిపాలన పదవులు మార్చకపోవడంతో పలువురు ప్రొఫెసర్లు వీసీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కేయూ మహిళా టీచర్లు.. వీసీని కలిసి అడ్మినిస్ట్రేషన్ పదవులపై మాట్లాడినట్లు తెలిసింది. కొన్ని సంవత్సరాల నుంచి కొందరు మాత్రమే ప్రొఫెసర్లు అడ్మినిస్ట్రేషన్ పదవుల్లో ఉంటున్నారని, అందరికీ అవకాశం కల్పించాలని అడిగినట్లు తెలిసింది. గతంలో కేయూ టీచర్ల సంఘం అకుట్ కూడా వీసీకి దీనిపై రిప్రజెంటేషన్ ఇచ్చిందని తెలిసింది. అయినా ఇప్పటి వరకు రెండు, మూడు అడ్మినిస్ట్రేషన్ పదవులు ఒకే ప్రొఫెసర్ చేస్తుండడం ఆ పదవులను మార్చకపోవడం వీసీ పాలనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి

- త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి
- ఆర్ట్స్ కళాశాల మైదానంలో సంకీర్తన ప్రవచనాలు


మాట్లాడుతున్న చినజీయర్‌స్వామి

హన్మకొండ కల్చరల్ : సనాతన ధర్మం, సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించడానికి కృషి చేయాలని త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి అన్నారు. గురువారం వికాస తరంగిణి హనుమకొండ, వరంగల్ ఆధ్వర్యాన హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో చిన జీయర్‌స్వామి నేతృత్వాన సంకీర్తన ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. తొలుత జీయర్‌స్వామికి మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన టాప్‌లెస్ జీప్‌లో జీయర్‌స్వామి పబ్లిక్ గార్డెన్ నుంచి బయలుదేరి ర్యాలీగా ఆర్ట్స్ కళాశాల మైదానం వేదిక వరకు చేరుకున్నారు. అనంతరం సంకీర్తన ప్రవచనాలను ప్రారంభించి మాట్లాడారు. వరంగల్ నగరం భక్తి ప్రవాహంలో మునిగి తెలుతోందని, సంకీర్తన ప్రవచనాలు వింటే ఎంతో పుణ్యం, మోక్షం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, గురువులు పిల్లలకు జ్ఞానం, సంస్కృతి, ఆచారాన్ని అందిస్తే సమాజంలోనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో దేవనాథ జీయర్‌స్వామి, సెంట్రల్ వికాస తరంగిణి సభ్యులు భవానీప్రసాద్, రమణమూర్తి, జిల్లా మాజీ అధ్యక్షులు ఆచార్య పాకనాటి జ్యోతి, బాధ్యులు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, నేపాల్‌కు చెందిన కృష్ణమాచార్య స్వామి, నగర మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ ఎమ్మెల్యే సతీమణి నాయిని నీలిమ, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శోభాయాత్ర

ఉదయం పబ్లిక్ గార్డెన్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్యం, బంజారా నాట్యం, బోనాలు, భజనలు, చెక్క భజన, ఒగ్గు కథలు, చిందు, యక్షగానం, హరికథా, చిడుతల రామాయణం తదితర 14 రకాల కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రామ, గోవింద నామాలతో శ్రీమన్నారాయణుడిని స్మరిస్తూ వేలాది మంది మహిళలు శోభాయాత్రలో పాల్గొన్నారు.


ప్రవచన కార్యక్రమానికి హాజరైన భక్తులు

పత్తి మొత్తం కొనుగోలు చేస్తాం

- సీసీఐ సీజీఎం పాణిగ్రహి


పాణిగ్రహి

వరంగల్ : ప్రస్తుత సీజన్ 2024-25(అక్టోబర్ 2024-సెప్టెంబర్ 2025)లో అన్ని రాష్ట్రాలలో కనీస మద్దతు ధర పథకం కింద పత్తి మొత్తం కొనుగోలు చేస్తామని సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)సీజీఎం(మార్కెటింగ్) ఎస్‌కే.పాణిగ్రహి ఒక ప్రకటనలో తెలిపారు. చివరి వరకు అన్ని గ్రేడ్‌ల పత్తి కొనుగోలు ప్రక్రియ యథావిధిగా సాగుతుందన్నారు. రైతులు ఆందోళనలతో తమ పంటలను విక్రయించాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాలు ఈఏడాది సెప్టెంబర్ వరకు పనిచేస్తాయన్నారు. రైతులు తమ ఉత్పత్తులను విక్రయించడంలో ఎలాంటి సమస్య ఎదురైనా 77189 55728 నంబర్‌కు వాట్సాప్ మెసేజ్ పంపాలని కోరారు.

ప్రజాసేవ గొప్ప వరం


హాజరైన నాలుగు రాష్ట్రాల నీటి ప్లాంట్ల కమిటీ సభ్యులు


మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కె.వి.రమణారెడ్డి

ఎమ్మెల్యేలు కె.వి.రమణారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- కాజీపేట బాలవికాసలో తాగునీటి శుద్ధీకరణ పథకం కమిటీల మహాసభ
- హాజరైన నాలుగు రాష్ట్రాల సభ్యులు

కాజీపేట రూరల్ : ప్రజాసేవ గొప్ప వరమని, బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిసా లాంటి బిడ్డ వరంగల్‌లో పుట్టి కెనడాలో స్థిరపడి సొంత గడ్డకు సేవ చేయాలనే ఆలోచన రావడం గొప్ప విషయమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపెల్లి రమణారెడ్డి అన్నారు. కాజీపేట బాలవికాసలో గురువారం 'సుస్థిర నిర్వాహణ, సుస్థిర పథకాలు' అనే అంశంపై బాలవికాస తాగునీటి శుద్ధీకరణ పథక కమిటీల మహాసభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలను ముందుగానే గుర్తించి వాటికి అనుగుణంగా పథకాలు రూపొందించి ప్రభుత్వాలకు స్ఫూర్తినిస్తున్న బాలవికాస సేవలు అభినందనీయమన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో శుద్ధి నీటి ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న బాలవికాస సేవలు అమోఘమన్నారు. కమిటీ సభ్యులు గ్రామస్థాయిలో మరింత దృఢంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిసా జింగ్రాస్ కెనడా నుంచి ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా కేవలం సేవాదృక్పథంతో ఏర్పాటు చేసిన ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కమిటీ సభ్యులు అవగాహన కల్పించాలన్నారు. అలాగే, కెనడా నుంచి ఆన్‌లైన్‌లో సోపార్ కెనడా డైరెక్టర్ శోభా మాట్లాడుతూ సృష్టిలో నీరు చాలా ముఖ్యమని, అలాంటి నీటిని ప్రజలందరికీ అందిస్తున్న కమిటీ సభ్యులందరికీ అభినందనలు చెప్పారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి మాట్లాడుతూ 45 ఏళ్లుగా బాలవికాస సేవాకార్యక్రమాలు చేస్తోందని, సుమారు 35 లక్షల మందికి 1,550 శుద్ధి నీటి ప్లాంట్ల ద్వారా రోజూ మంచినీరు అందిస్తోందన్నారు. బాలవికాస అధ్యక్షుడు నోముల ఇంద్రారెడ్డి, రైతు వికాస అధ్యక్షుడు కె. రాజమౌళి, జనవికాస అధ్యక్షుడు లూర్దు మర్రెడ్డి, డైరెక్టర్లు రాహుల్, సునీతారెడ్డి, మేనేజర్లు ప్రతాప్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లతారెడ్డి,ఫ్రాన్సిస్ రెడ్డి, తిరుపతి, మంజుల, శోభ, శివరాం, మోసెస్, విజేందర్, నా లుగు రాష్ట్రాలు తెలంగాణ, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నీటి ప్లాంట్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి

- హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతిలాక్రా


మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ స్వాతిలాక్రా

వరంగల్ క్రైం: డయల్ 100 ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి ఘటనా స్థలికి చేరుకోవాలని హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లాక్రా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీకి సీపీ అంబర్ కిశోర్ ఝా స్వాగతం పలకగా సాయుధ పోలీసులు గౌరవవందనం చేశారు. అనంతరం పోలీస్ అధికారులతో సమావేశం కాగా కమిషనరేట్ విభాగం పనితీరు, శాంతి భద్రత నియంత్రణలో భాగంగా తీసుకుంటున్న చర్యలపై సీపీ అంబర్‌కిశోర్ ఝా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీ స్వాతి లాక్రా మాట్లాడుతూ మహిళలకు సంబంధించి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. బాధితులకు న్యాయం కల్పించడంతో పాటు నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాల ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు కచ్చితంగా కేసు నమోదు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత పీఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, విద్యార్థుల్లో ట్రాఫిక్, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్‌పై అవగాహన కల్పించేందుకు ప్రతి కళాశాలలో సేఫ్టీ ఉమెన్, యాంటీ డ్రగ్స్, సేఫ్టీ ట్రాఫిక్, యాంటీ ర్యాగింగ్ క్లబ్స్ ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. అనంతరం కమిషనరేట్ కార్యాలయంలోని డాగ్ స్క్వాడ్, ఆర్మ్‌డ్ రిజర్వ్‌లోని ఆయుధగారంతో పాటు నూతనంగా నిర్మిస్తున్న కమిషనరేట్ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, రాజమహేంద్రనాయక్, ఏఎస్పీలు చేతన్, మనాన్ భట్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ప్రతిష్ట మరింత పెంచాలి

- పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ
- 254 మంది హెచ్‌సీలు, 225 మంది ఏఎస్సైల పదోన్నతి శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ

మామునూరు: పోలీస్ శాఖ ప్రతిష్ట మరింత పెంచేలా ట్రైనింగ్‌ను క్రమ శిక్షణతో పూర్తి చేయాలని పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ (ఎస్పీ) సూచించారు. ఏఎస్సైలు(ఏఆర్), హెడ్ కానిస్టేబుళ్ల (ఏఆర్) ప్రమోషన్ ట్రైనింగ్‌లో భాగంగా గురువారం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో 14 రోజుల పాటు నిర్వహించే పదోన్నతి శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. 225 మంది ఏఆర్ ఏఎస్సైలు, 254 మంది ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు పదోన్నతి శిక్షణకు హాజరయ్యారని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణతో అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రమేశ్, వెంకటేశ్వరరావు, పాండు నాయక్, భిక్షపతి, ఆర్ఐ చంద్రశేఖర్, మహేశ్, నవీన్, కాశీరామ్, రవీందర్, వడ్డె నరేశ్, సుధాకర్, సత్యనారాయణ, దీపక్, సమ్మిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఆర్ ఎస్సైలు రాజేశ్, సుధాకర్, దశరథం, సీసీ రామాంజనేయరెడ్డి, డాక్టర్ సుధీర్, పీఆర్ఓ రామాచారి, తదితరులు పాల్గొన్నారు.


వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

> వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.


పవన్ ప్రేమ్ కుమార్

మహబూబాబాద్ రూరల్ : లాడ్జ్‌లో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని చాకలి కాలనీకి చెందిన పనస పతంజలి పవన్ ప్రేమ్ కుమార్ (30) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శివప్రియ లాడ్జ్‌లో బుధవారం గది అద్దెకు తీసుకున్నాడు. ఒకరోజు ఉండి వెళ్లిపోతానని నిర్వాహకులతో చెప్పి ఉదయం నుంచి రాత్రి వరకు ఆ గదిలోనే ఉండి నిద్రించాడు. గురువారం ఉదయం పనివాళ్లు అతడు ఉన్న గది శుభ్రం చేసేందుకు తలుపు తట్టగా ఎంతకీ తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూశారు. పవన్ ప్రేమ్ కు మార్ ఫ్యాన్‌కు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. దీంతో లాడ్జ్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వగా టౌన్ ఎస్సై శివ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. లాడ్జ్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా, మృతుడు కుటుంబ కలహాల కారణంగానే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

బెదిరింపులకు భయపడి వ్యక్తి ..


కృష్ణ(ఫైల్)

ఖానాపురం: కొందరు బెదిరింపులకు పాల్పడడంతో భయపడిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని రాగంపేటలో చోటుచేసుకుంది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొయ్యడి కృష్ణ(40) గీత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వృత్తిలో భాగంగా ఈనెల 29న ఐనపల్లిలో తాటిచెట్టు ఎక్కడానికి వెళ్లాడు. 2021లో జరిగిన రోడ్డు ప్రమాద కేసు కాంప్రమైజ్ చేసుకోవాలంటే రూ. 10లక్షలు చెల్లించాలని, లేనిఎడల తన కుటుంబ సభ్యులను చంపుతామని గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు కృష్ణతో గొడవపడి బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన కృష్ణ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. కాగా, కృష్ణ ఆత్మహత్యాయత్నానికి పాల్పడే ముందు కొంత మంది వ్యక్తులు తన భార్య,పిల్లలను చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారి బెదిరింపులు తట్టుకోలేకే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని తీసిన సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. ఈ వీడియోను కుటుంబ సభ్యులు పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది.

వనపర్తిలో వ్యక్తి..

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తికి చెందిన కొడె యాదయ్య (50) పురుగుల మందు ఆత్మహత్యకు యత్నించి తాగి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మద్యానికి బానిసైన యాదయ్యను కుటుంబ సభ్యులు వారించారు. దీంతో మనస్తాపం చెందిన యాదయ్య ఈ నెల 29న మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

పసరగొండలో బాలుడు..

దామెర: అవమాన భారంతో బాలుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హనుకొండ జిల్లా దామెర మండలం పసరగొండలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పసరగొండ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలుడు ములుగు సమీపంలోని ఓ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఇంటికి వచ్చిన అతను గురువారం సమీపంలోని బాబాయి ఇంటికివెళ్లి రూ.90 దొంగిలించుకొని వస్తున్న క్రమంలో ఆ కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. దీంతో అవమానంగా భావించిన బాలుడు కొద్దిదూరంలో ఉన్న బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు స్థానికుల సాయంతో బాలుడి మృతదేహాన్ని వెలికితీసి ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఎస్సై కొంక అశోక్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై పేర్కొన్నారు.

ఔషధ రంగంలో నూతన ఆవిష్కరణలు అవసరం

- జాతీయ సదస్సులో కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి


మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: ఔషధ రంగంలో నూతన ఆవిష్కరణలు అవసరమని, యువ పరిశోధకులు ముందుకురావాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఫార్మస్యూటికల్ సైన్సెస్' అనే అంశంపై గురువారం కేయూ సెనేట్‌హాల్‌లో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశోధనల్లో సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు ముఖ్యమని పేర్కొన్నారు. మానవ మనుగడ, ఉత్తమ జీవన విధానాన్ని ప్రపంచం కోరుకుంటోందని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో తట్టుకొని రాణించాలంటే అకడమిక్ రీసెర్చ్‌పై శ్రద్ధ వహించాలని చెప్పారు. కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలకు బలమైన పూర్వవిద్యార్థుల సమూహం ఉందని, విద్యార్థులు ఇంటర్‌పర్సనల్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు.'ఇన్నోవేటివ్ డిస్కవరీ అప్రోచెస్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ కాంప్లమెంటరీ అండ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్' అనే అంశంపై నాందేడ్ శ్రీరామానందతీర్థ్ మరట్వాడా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ శశికాంత్ సిధవాలే కీలకోపన్యాసం చేశారు. కేయూలోని ఫార్మసీ కళాశాల ఆధ్వర్యాన యూజీసీ యూనిట్, అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో నోవార్టిస్ శాస్త్రవేత్త డాక్టర్ ఎంసీపీ వేణుగోపాల్, నల్లా మల్లారెడ్డి ఫార్మసీ కాలేజీ డీన్ డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ మహేశ్ అరుందల, యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్, డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, బీఓఎస్ ఆచార్య జె.కృష్ణవేణి, ఆచార్య వై.నర్సింహారెడ్డి మాట్లాడారు. అనంతరం పరిశోధన పత్రాల అబ్‌స్ట్రాక్ట్‌ను అతిథులు విడుదల చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


గణపురం: గణపురం మండలం చెల్పూరు కేటీపీపీ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బానోత్ రాజేశ్(23) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. కేటీపీపీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న కుందురుపల్లికి చెందిన రాజేశ్ విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

ఎల్ఐసీ ఆఫీస్‌లో రూ. 50 వేల నగదు అపహరణ

జనగామ రూరల్: ఎల్ఐసీ కార్యాలయంలో పాలసీ డబ్బు జమ చేస్తుండగా గుర్తుతెలియని బాలుడు ఆ నగదును అపహరించాడు. ఈ ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు, ఎల్ఐసీ ఏజెంట్ జి.ఎలేందర్ కథనం ప్రకారం .. దేవరుప్పుల మండలం కడవెండికి చెందిన లక్ష్మికి చెందిన పాలసీ డబ్బులు చెలించడానికి ఎలేందర్ పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయానికి వచ్చాడు. డబ్బులు చెల్లిస్తున్న క్రమంలో పక్కనే ఉన్న బాలుడు..ఎలేందర్ జేబు నుంచి రూ. 50 వేలు తీసుకుని వెళ్లిపోయాడు. ఈ ఘటనపై ఎలేందర్ ఫిర్యాదు మేరకు కేసు ఎస్సై భరత్ కేసు నమోదు చేసి సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

చలిమంటల్లో పడి విద్యార్థికి గాయాలు

- మల్యాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘటన



ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం మల్యాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో 3వ తరగతి చదువుకుంటున్న గొత్తికోయ గిరిజన విద్యార్థి ఎట్టి భూదేశ్ చలిమంటల్లో పడగా రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం రాత్రి సమయంలో చలి నుంచి ఉపశమనం పొందడానికి పాఠశాల ఆవరణలో చలిమంటల కోసం విద్యార్థులంతా కలిసి కర్రపుల్లలు, ఎండుగడ్డికి నిప్పుపెట్టారు. భూదేశ్ అదుపుతప్పి మంటల్లో పడిపోవడంతో రెండు కాళ్లకు పెద్ద బొబ్బలు వచ్చాయి. హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూఓ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థి తల్లిండ్రులు అడవిమార్గంలో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూఓ మద్యం తాగి గ్రామంలో తిరుగుతున్నట్లు పేర్కొన్న గ్రామస్తులు.. గతంలోనూ ఇక్కడ పనిచేసిన వ్యక్తి మద్యం తాగి పాఠశాలకు వస్తుండగా ఏటీడీఓ క్షేత్రయ్యకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఈ విషయంపై ఐటీడీఏ డీడీ పోచం, ఐటీడీఏ ఏటీడీఓ క్షేత్రయ్యకు ఫోన్ చేసినప్పటికీ లిఫ్ట్ చేయడం లేదు. అయితే ఈ విషయం తెలుసుకున్న ఐటీడీఏ అధికారులు ఆశ్రమ పాఠశాలకు ప్రత్యేక అంబులెన్స్ పంపుతున్నట్లు సమాచారం.